క్లుప్తంగా

బాలాత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక అలంకరణ


ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీదేవి

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మ వారికి కనకాంబరాలు, మల్లె పూలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో అమెరికాకు చెందిన గంటా బాలాజీ, శిరీష దంపతులచే కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కనకాంబరాలు, మల్లెపూలతో పూజలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు.

పీ4 సర్వేపై అధికారులకు శిక్షణ


సర్వేపై శిక్షణ ఇస్తున్న అధికారులు

ఉండి: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కుటుంబ సమాచారాన్ని పూర్తి స్థాయిలో సేకరించే పనిలో భాగంగా నిర్వహించే పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టిసిపేషన్) సర్వేపై గ్రామ స్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఓ రామారావు, మాస్టర్ ట్రైనీ ప్రవీణ్ కుమార్ గ్రామ స్థాయి అధికారులకు శిక్షణను అందించారు. ఈ నెల 8వ తేదీ శనివారం నుంచి 18వ తేదీ గురువారం లోపుగా అనగా పది రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


శిక్షణ పొందిన వారికి ధ్రువ పత్రాలు అందిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

ఉండి: శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై శిక్షణ పొందిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ దండు జగన్నాథరాజు అన్నారు. కేవీకేలో ఏడు రోజుల నుంచి నిర్వహిస్తున్న తేనెటీగల పెంపకం కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గోదావరి మండల పరిశోధనా సహ సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.డెబోరా మెస్సియానా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్.బిందు ప్రవీణ, డాక్టర్ పి.వినయ లక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వ సభ్య సమావేశం నిర్వహణ


సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయితీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వ్యయాలతో రూపొందించిన రూ.7,23,12,109 మిగులుతో అంచనా బడ్జెట్‌ను సర్వ సభ్య సమావేశం ఏకగ్రీవంగా శుక్రవారం ఆమోదించింది. స్థానిక నగర పంచాయతీ చైర్‌సర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో 2025--26 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.25,22,34,201 గానూ, వ్యయం రూ.19,59,47,000 గానూ బడ్జెట్ రూపొందించారు. గత ఏడాది రూ.1,60,24,098 ప్రారంభ నిల్వతో కలిపి ఈ ఏడాది మొత్తం ఆదాయం రూ.26,82,59,109 రూపొందించారు. ఈ మేరకు కమిషనర్ జి.కృష్ణమోహన్ వివరించారు.

సమస్యలను పరిష్కరించండి

పట్టణంలోని సమస్యల పరిష్కారానికి కౌన్సిలర్లు, అధికారులు సహకరించాలని చైర్‌పర్సన్ జామి హైమావతి విజ్ఞప్తి చేశారు. విద్యుత్, మంచినీటి సమస్య పరిష్కారానికి సంబంధిత జేఈలతో మాట్లాడి తక్షణం చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. వేసవి దృష్ట్యా మంచినీటి చెరువుల్లో నీటిని త్వరితగతిని నింపాలని ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంచినీటి సమస్య, వీధి లైట్ల సమస్యలు పరిష్కరించాలని కౌన్సిలర్లు మొర పెట్టుకున్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్, కటికతల జాన్‌వెస్లీ, దొడ్డి జగదీష్, జిల్లా పెద్దిరాజు, మోటుపల్లి కుమారి, మాధవి, అప్రపున్నీస్సా, కిమిడి అరుణ కుమారి, గోపిశెట్టి సత్యవతి, బొల్లా శ్వేత పాల్గొన్నారు.

ఆఖరి మజిలీలోనూ అవస్థలే

- అధ్వానంగా శ్మశాన వాటికలు
- చిట్టడవులను తలపిస్తున్న వైనం
- కనీస సౌకర్యాలు లేక ఇక్కట్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో శ్మశాన వాటికల్లో మొక్కలు, తుప్పలు పెరిగి చిట్టడవిని తలపించడంతో మృతదేహాలను ఖననం చేయడానికి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికల్లో విపరీతంగా పెరిగిన మొక్కలు, తుప్పలు విష సర్పాలకు నిలయంగా మారడంతో అక్కడకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. సాయంత్రం, రాత్రి సమయంలో శ్మశాన వాటికకు వెళ్లవలసి వస్తే వణికిపోతున్నారు. శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారు. లైటింగ్, నీడ, నీళ్లు, కూర్చోవడానికి బెంచీలు తదితర సౌకర్యాలు లేవు. కనీసం తలకొరివి పెట్టే వారు స్నానం చేయడానికి బకెట్ నీళ్లు కూడా అక్కడ లభించని పరిస్థితి ఉంది. పరిస్థితి దారుణంగా ఉన్నప్పటికీ శ్మశాన వాటికల గురించి మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. భీమవరం మున్సిపాలిటీ పరిధిలో అన్ని మతాలకు సంబంధించి 10 వరకు శ్మశాన వాటికలు ఉన్నాయి. వాటిలో కొన్ని దూరంగా ఉంటే మరి కొన్ని నివాసాల మధ్య, జనావాసాలకు అనుకుని ఉన్నాయి. వాటిని పరిశుభ్రంగా ఉంచకపోవడం వలన స్థానికులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.


లక్ష్మీ టాకీస్ సమీపంలో చిట్టడవిని తలపిస్తున్న హిందూ శ్మశాన వాటిక


18వ వార్డులో అధ్వానంగా ఉన్న శ్మశాన వాటిక

అభివృద్ధికి నోచుకోని శ్మశాన వాటికలు

కోట్ల రూపాయల ఆదాయం కలిగిన భీమవరం మున్సిపాలిటీలో శ్మశాన వాటికలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. శ్మశాన వాటికల అభివృద్ధి కోసం పైసా ఖర్చు చేయడం లేదు. ప్రజల నుంచి పన్నులు వసూళ్లు పక్కాగా చేస్తున్న మున్సిపాలిటి అధికారులకు శ్మశాన వాటికలు కూడా ప్రజలు ఉపయోగించుకుంటారని వాటిని అభివృద్ధి చేయాలని ఆలోచన లేదు. 15వ ఆర్థిక సంఘం నిధులతో శ్మశాన వాటికలు అభివృద్ధి చేయొచ్చు. మున్సిపాలిటీలో నిధులు మురుగుతున్నాయి తప్పా అభివృద్ధి పనులకు ఉపయోగపడడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి శ్మశాన వాటికలను శుభ్రం చేయించి, కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్నాయి



భీమవరంలో శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయి. మొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో వాటిని తొలగించి అంత్యక్రియలు చేసుకుంటున్నారు. విపరీగా పెరిగిన మొక్కలు, తుప్పల కారణంగా పాములు తిరుగుతున్నాయి. అంత్యక్రియలు చేయడానికి వెళ్లేవారు భయందోళన చెందుతున్నారు. శ్మశాన వాటికల్లో అప్రమత్తంగా లేకపోతే ఏ జంతువులు వచ్చి దాడులు చేస్తాయోనని భయపడుతున్నారు. శ్మశాన వాటికలను శుభ్రం చేయడం లేదు.

-ఎస్.శ్రీరామ చంద్రమూర్తి

కనీస సౌకర్యాలు కల్పించాలి



భీమవరంలో శ్మశాన వాటికల్లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల లక్ష్మీ టాకీస్ సమీపంలో ఉన్న శ్మశాన వాటికు అంత్యక్రియలు చేయడానికి వెళ్లిన సమయంలో తలకొరివి పెట్టిన వ్యక్తి సాన్నం చేయడానికి, కాళ్లు చేతులు కడుక్కోవడానికి కనీసం బకెట్ నీళ్లు దొరకలేదు. శ్మశాన వాటికకు వచ్చేవారు కూర్చోవడానికి బెంచీలు, వేచి ఉండడానికి షెడ్లు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు వస్తే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. భీమవరంలో శ్మశాన వాటికల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.

-అమనాపు అప్పారావు భీమవరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వీరవాసరం: మండలంలోని కొణితివాడ సబ్ స్టేషన్‌లో కొత్త లైన్లు ఏర్పాటు చేయడానికి కొణితివాడ లోకల్ ఫీడర్ ఇండస్ట్రియల్ ఫీడర్ తేదీ 8వ తేదీ శనివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎలక్ట్రికల్ ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. కొణితివాడ, నేలపోగుల గ్రామాలకు, ఇండస్ట్రియల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఉండి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత గుండాబత్తుల సుబ్బారావు పర్యవేక్షణలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భీమవరం పట్టణానికి చెందిన మిత్ర మెడీకేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి ఉండి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని నియోజకవర్గంలోని మహిళలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి

నరసాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నరసాపురం మున్సిపాలిటీలో వ్యాపార దుకాణాల ఎంఎస్ఎంఈ సర్వే చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు షాపుల యజమానులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, జీఎస్‌టీ నెంబర్, బ్యాంకు అకౌంట్ నెంబర్ చూపించి సహకరించాలని సూచించారు.

బాలికలు ఆత్మవిశ్వాసంతో మెలగాలి

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళ అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందని, బాలికలు విద్యలో రాణించడమే కాకుండా ఆత్మ విశ్వాసంతో ముందుకు పయనించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విజ్ఞాన సాంస్కృతిక వికాస కేంద్రంలో సహాయ సొసైటీ నిర్వాహకులు జిల్లెళ్ల సత్య సుధామ, కృపానివాస్ సోషల్ సర్వీసెస్ నిర్వాహకురాలు మైలాబత్తుల జ్యోతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళల దినోత్సవం ఒక రోజు ముందుగానే నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమాజం, కుటుంబ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అలాగే సహనానికి మారు పేరు మహిళలని ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి పులపర్తి సత్యవేణి అన్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో కోపా కల్యాణ మండపంలో ఇన్నర్ వీల్ క్లబ్ సహకారంతో భీమవరం పట్టణంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న 25 మంది మహిళా మూర్తులను సత్యవేణి చేతుల మీదుగా వారిని సత్కరించారు. ప్రపంచ మహిళ దినోత్సవం సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మీ ఆధ్వర్యంలో పట్టణంలో పలు రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న మహిళలను సత్కరిస్తామన్నారు. అలాగే రవాణా శాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా 600 మహిళలు ఫ్యాన్సీ డ్రెస్‌తో భారీ ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. అదే విధంగా మహిళా దినోత్సవం సందర్భంగా 3వ అదనపు జిల్లా కోర్టు హాలులో న్యాయమూర్తి లక్ష్మి నారాయణ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కె.సత్యవేణి, జిల్లెళ్ల సత్య సుధామ, మైలాబత్తుల జ్యోతి, గూడూరు సీతా మహాలక్ష్మి, దాసి సౌజన్య, జెస్టాన్లీ శోభిత, తదితరులు పాల్గొన్నారు.


భీమవరం (ప్రకాశం చౌక్): కలెక్టర్ నాగరాణిని సత్కరిస్తున్న సోషల్ సర్వీసెస్ నిర్వాహకురాలు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


ఆకివీడు: మహిళా చైర్‌పర్సన్, కౌన్సిలర్లను సత్కరిస్తున్న వైస్ చైర్ పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి పిలుపునిచ్చారు. స్థానిక నగర పంచాయతీ ఆవరణలోమహిళా దినోత్సవం పురస్కరించుకుని వైస్ చైర్మన్ పుప్పాల పండు ఆధ్వర్యంలో మహిళా కౌన్సిలర్లు, చైర్ పర్సన్లను శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజంలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లను, చైర్‌పర్సన్‌ను పండు, ఇతర కౌన్సిలర్లు సత్కరించారు. మహిళా హక్కులను మానవ హక్కులుగా గుర్తించాలని ఐద్వా సీనియర్ నాయకురాలు ఎస్.ఉదయకుమారి పిలపుపునిచ్చారు. స్థానిక రైస్‌మిల్లర్ల భవనంలో మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు బీ.పార్వతి, అజిలక్ష్మి, బీ.కల్యాణి, జీవీ.లావణ్య, జీ.రాణి, జీ.అచ్చియమ్మ, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో కేసులు దర్యాప్తు చేయాలి

పెనుమంట్ర : పోలీస్ స్టేషన్‌లో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసులను దర్యాప్తు చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పలు కేసులపై ఆరా తీశారు. ముఖ్య ప్రాంతాలలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి వాటి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలలో అవగాహన సదస్సులు నిర్వహించి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేసే వారిని అరికట్టాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టం ద్వారా భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు.

పిల్లల పెంపకంపై అవగాహన సదస్సు


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ ప్రతాప్‌కుమార్

ఆకివీడు: ఆధునిక ప్రపంచంలో పిల్లలను పెంచడం ఒక సవాల్‌గా మారిందని ఐఎంఏ ప్రతినిధి డాక్టర్ పీబీ ప్రతాప్‌కుమార్, యోగాసనాచార్యులు ఉండ్రమట్ల సాంబశివరావు చెప్పారు. స్థానిక పిల్లల ఆసుపత్రిలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో పిల్లల పెంపకంలో అనేక దుష్పరిణామాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదవులో ఏకాగ్రత లేకపోవడం, మర్చిపోవడం, మొండితనం, మాట వినకపోవడం, అల్లరి, కుదురు లేకపోవడం సెల్ ఫోన్ ప్రభావం, మౌనంగా, ఆందోళనగా ఉండటం వంటి సమస్యలు పిల్లల్లో ఉత్పన్నమవుతున్నాయన్నారు. మానసిక ఎదుగుదల లేకపోవడం వంటి సమస్యలకు పరిష్కార మార్గంగా అవగాహన సదస్సు ఉపయోగపడుతుందన్నారు. ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక షాదీ ఖానా హాలులో ఐఎంఏ, ఆదిత్య విద్యా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కేఎల్ మాధవి, డాక్టర్ అలేఖ్య జంపన పాల్గొంటారని తెలిపారు.

క్రీడా పోటీల్లో పెన్నాడ విద్యార్థుల ప్రతిభ


జోనల్ పోటీల్లో ప్రతిభ చూపిన పెన్నాడ విద్యార్థులు

పాలకోడేరు: సిద్ధాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన గ్రిగ్స్, జోనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో పెన్నాడ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఎన్ బాలకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం విజేతల వివరాలను విడుదల చేశారు. బాలికల విభాగంలో త్రోబాల్‌లో పెన్నాడ విద్యార్థులు ప్రథమ స్థానం సంపాదించారు. స్పోర్ట్స్‌లో గుత్తుల సత్య లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, 100 మీటర్ల రన్నింగ్ రేస్‌లో ద్వితీయ స్థానం, 200 మీటర్ల రన్నింగ్ రేస్‌లో తృతీయ స్థానం సాధించి ఛాంపియన్ షిప్ అందుకుందని హెచ్ఎం తెలిపారు. కాగిత దేవిప్రియ డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానం సాధించింది. షేక్ ఫరీదా బేగం షార్ట్ పుట్‌లో తృతీయ స్థానం సాధించింది. బాలుర విభాగంలో పాము హనుమాన్ షార్ట్ పుట్‌లో తృతీయ స్థానం సాధించారు. శృంగవృక్షం హైస్కూల్‌లో నిర్వహించిన సెంట్రల్ జోన్ జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారు. విజేతలను సర్పంచ్ చిల్లా అనూష, ఎస్ఎంసీ చైర్మన్ ఆదాడ రమాదేవి, ఉపాధ్యాయులు ఎం.పెద్దిరాజు, జె.వీరభద్రం, పాలా దుర్గారావు అభినందించారు.

రేపు లయన్స్ ఆర్సీ మీట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ రీజనల్ చైర్ పర్సన్ గొంట్లా కృష్ణమూర్తి

ఆకివీడు: లయన్స్ రీజినల్ సమావేశం ఈ నెల 9వ తేదీన స్థానిక లయన్స్ వీ కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తామని రీజియన్ చైర్‌పర్సన్ గొంట్లా కృష్ణమూర్తి చెప్పారు. స్థానిక లయన్స్ భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు సమావేశానికి హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా రూ.6 లక్షల విలువైన 36 కుట్టు మిషన్లు, 19 గ్రైండర్లు, మూడు వీల్ చైర్లు, వీల్ సైకిళ్లు, 2 వైండింగ్ మిషన్లు, వ్యాపారస్తులకు అనుకూలమైన 50 గొడుగులు పంపిణీ చేస్తామని చెప్పారు. సమావేశానికి ముఖ్యఅతిధులుగా జిల్లా కలెక్టర్ నాగరాణి, ఇండియన్ మెమరీ స్పోర్ట్సు కౌన్సిల్ అధ్యక్షుడు యసింహ పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో డాక్టర్ ఎం వీ సూర్యనారాయణరాజు, సీహెచ్ కృష్ణంరాజు, ఆర్వీ సూర్యనారాయణరాజు, కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి, సన్నిధి వెంకన్న, గుర్రం ఈశ్వర రావు, నేరెళ్ల చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఆకివీడు-దిగమర్రు జాతీయ రహదారి నిర్మాణానికి భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అధికారులతో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆకివీడు-దిగమర్రు నేషనల్ హైవే 165 భూ సేకరణకు సంబంధించిన వర్గీకరణ విషయంలో ఎన్‌హెచ్-165 ఎలైన్‌మెంట్‌కు 3ఏ భాగంగా భూమి వర్గీకరణలో రెవెన్యూ రికార్డులను ఆధునికరించి భూమిని పరిశీలించాలన్నారు. ఈ భూమిలో ఉన్న కట్టడాలు, చెట్లు, తదితరాలకు సంబంధించి వీడియోలు, ఫొటోలతో కూడిన నిరిక్షణ సమాచారాన్ని రికార్డు చేసుకోవాలన్నారు. సదస్సులో ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సంజీవ నాయుడు, భూ సేకరణ అధికారి జె.శివ శ్రీనివాసు, జిల్లా రిజిస్ట్రార్ ఎల్.వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, సీహెచ్ రవి కుమార్, జి.కళ్యాణి, తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, సబ్ రిజిస్ట్రార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్న హస్తం


అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు వారిని మానవత్వంతో ఆదుకోవడం మన కనీస భాధ్యత అని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. ఇటీవల ఉండి పెదపేటకు చెందిన బూరగ వెంకటరత్నం, జ్యోతికి చెందిన ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై కాలిపోవడంతో కుటుంబానికి ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. స్వర్గీయ పెన్మత్స కృష్ణంరాజు కుమారుడు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, డీసీ కన్నెగంటి రూత్‌కళ, మాజీ అధ్యక్షురాలు ముదునూరి విజయ, కోశాధికారి పాలతీర్థపు నర్సింగరాజు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, తదితరులు పాల్గొన్నారు.

అన్నయ్యకోడు పంట కాలువ కలుషితం


పసర్లుగా మారిన అన్నయ్యకోడు పంట కాలువ

కాళ్ల: అన్నయ్యకోడు పంట కాలువ పసర్లుగా మారింది. జువ్వలపాలెం గ్రామ పరిధిలో పంట కాలువకు ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన రిటైనింగ్ వాల్ శిథిలావస్థకు చేరింది. దీంతో రిటైనింగ్ వాల్ గోడ లీక్ అవ్వడంతో మురుగు డ్రెయిన్ నీరు పంట కాలువలోకి వచ్చి చేరుతుంది. దీంతో జువ్వలపాలెం పరిధి నుంచి కలవపూడి శివారు వరకు సుమారు ఎనిమిది గ్రామాలకు తాగు, సాగు నీరు అందించే పంట కాలువ పసర్లుబారి అధ్వానంగా మారింది. దీని వలన రానున్న రోజుల్లో మంచినీటి చెరువులు నింపుకోవాలంటే ఇబ్బందులు పడాల్సివస్తుందని శివారు గ్రామ ప్రజలు వాపోతున్నారు. సంబంధించిన శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శిథిలావస్థకు చేరిన రిటైనింగ్ వాల్‌ను పునరుద్ధరించాలని, లేకపోతే కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.